క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి



గిఫ్ట్ బాక్స్ ఓపెన్ చేస్తున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేసి బహుమతులు గెలుపొందాలని డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు. పుట్టపర్తి–ముదిగుబ్బ సర్వీసులో ఏర్పాటు చేసిన లక్కీ డిప్ బాక్స్‌ను బుధవారం ప్రయాణికుల సమక్షంలో తీశారు. కొత్తకోటకు చెందిన రమేష్, ముదిగుబ్బకు చెందిన లిఖిత, బుక్కపట్నంకు చెందిన రాజేంద్ర బహుమతులు గెలుపొందారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయం పెంపే లక్ష్యంగా లక్కీ డిప్ స్కీం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఐ పెద్దన్న తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడం అడ్డగింత

నల్లచెరువు: యర్రగుంట పల్లిలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని పోలీసులతో కలిసి రెవెన్యూ సిబ్బంది బుధవారం అడ్డుకున్నారు. వివరాలు.. తలమర్ల వాండ్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని యర్రగుంట పల్లిలో సర్వే నంబర్ 958లోని 4 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కల్లి పల్లికి చెందిన కొందరు ఆక్రమించారు. అక్రమంగా రేకుల షెడ్‌ను నిర్మిస్తున్నారని సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది పోలీసులతో కలిసి అడ్డుకున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని తెలిపారు. వీఆర్‌ఓ ఓబులేసు పాల్గొన్నారు.

విస్తృతంగా సెబ్ తనిఖీలు



పట్టుబడిన మద్యం చూపుతున్న సెబ్ అధికారులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో సెబ్ దాడులు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం తనకల్లు, హిందూపురం, చెన్నేకొత్తపల్లి సెబ్ స్టేషన్ల పరిధిలో దాడులు నిర్వహించారు. తనకల్లు సెబ్ స్టేషన్ పరిధిలో రెడ్డిపల్లి క్రాస్ వద్ద 96 కర్ణాటక మద్యం పాకెట్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. హిందూపురం టౌన్ పరిధిలో 140 బాటిళ్లు, చెన్నేకొత్తపల్లి వద్ద 32 మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బ్యాంకు సేవలపై అవగాహన



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రమణకుమార్

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరేపల్లిపేటలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి నాబార్డ్ డీడీఎం అనురాధ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రమణకుమార్, ఎంపీడీఓ అంజనప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రైతు ఆదాయం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్‌తో రైతుకు తక్కువ వడ్డీకే రుణాలిస్తారన్నారు. ప్రధాన మంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణతో జీవితానికి భరోసా



మాట్లాడుతున్న రామారావు

ధర్మవరం అర్బన్: స్వయం ఉపాధి శిక్షణతో జీవితానికి భరోసా లభిస్తుందని బైరెడ్ కంపెనీ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు, శ్రీసత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తిలు తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య పాతసత్రంలో బుధవారం మగ్గం, జర్దోసిలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ పట్టణంలో 37 రోజులపాటు డిసెంబర్ 13 వరకూ మగ్గం, జర్దోసిపై శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ సమయంలో భోజన వసతి కూడా కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మురళీధర్, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు పొరాళ్ల రాగిణి, సత్యసాయి సేవా సమితి భజన మండలి కన్వీనర్ సాంబశివ, ప్రసాద్, శిక్షకురాలు అనూష తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం



కొత్తచెరువు: పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ధర్మవరంలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, తదితరులు



నల్లచెరువు: అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: మహనీయుల త్యాగాలు స్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో నడవాలని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కలవల మురళీధర్ తెలిపారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కాలేజి సర్కిల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి బుధవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేకంగా రాష్ట్రం ఉండాలనే తపనతో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి చివరికి ప్రాణత్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించి తెలుగువారి గుండెల్లో అమరజీవిగా నిలిచిపోయారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కాకుమాని సాగర్, కోశాధికారి ఓపీ ప్రసాద్, నాయకులు గ్రంథె శ్రీనివాసులు, మోకా గోపి, ముంటిమడుగు రాఘవేంద్ర, అవినాష్, సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రామకృష్ణ, తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో..

వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులతో కలిసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొట్టి శ్రీరాములు త్యాగఫలమే..

కొత్తచెరువు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం కొత్తచెరువు శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు మహమ్మద్, రామాచారి, రమేష్, సుబ్రహ్మణ్యం, అసిఫుల్లా, అటెండర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీఓ శకుంతల ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టి 52 రోజుల పాటు నిరాహార దీక్ష చేశారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ హైదర్‌వలి, ఏఓ రామక్రిష్ణ,డైరెక్టర్ ఆదియూర్తి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమడగూరులో..

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మునెప్ప ఆధ్వర్యంలో చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అవతరణ వివరాలను తెలియజేశారు. పొట్టిశ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నసీమా, ఏపీఓ అమరావతి, జూనియర్ సహాయకులు శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ఎంపీడీఓ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుర్లి దామోదర రెడ్డి, ఎంపీపీ పర్వీన్ భాను, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మి రెడ్డి, సర్పంచులు రంగారెడ్డి, గోవిందు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ



నిజాంవలీ కాలనీలో పింఛన్ ఇస్తున్న వలంటీర్ ఫిరోజ్



డి.చెర్లోపల్లిలో పింఛన్ కోసం వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ చిన్న పెద్దన్న

బత్తలపల్లి: ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేస్తోంది. నవంబర్ నెలకు బుధవారం పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర సామాజిక పింఛన్లు మొత్తం 6,415 ఉన్నాయి. బుధవారం సాయంత్రం 5 గంటలకు 2,641 మందికి పంపిణీ చేసి 41 శాతం పంపిణీ పూర్తి కాగా పనులకు వెళ్లి వచ్చిన వారికి పంపిణీ చేయగా రాత్రికి 60 శాతంపైగా లబ్ధిదారులకు సాయం అందడం గమనార్హం.

రూ. 2 కోట్ల పింఛన్ నగదు పంపిణీ

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని 9,678 మందికి రూ. 2.71 కోట్లను బుధవారం ఒక్క రోజే వలంటీర్లు అందజేశారు. మొదటి రోజు 70 శాతం పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. గతంలో పింఛన్ల కోసం పడికాపులు కాయాల్సిన దుస్థితి ఉండేదన్నారు.

టీకాలే చిన్నారులకు శ్రీరామరక్ష



ఎం.అగ్రహారంలో టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలే చిన్నారులకు శ్రీరామరక్ష అని సీహెచ్‌ఓ హేమలత పేర్కొన్నారు. మండలంలోని తాడిమర్రి, ఎం.అగ్రహారం, నార్శింపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి శనివారం వైద్య సిబ్బంది చిన్నారులకు బీసీజీ, ఎంఎమ్మార్, డీపీటీ, నిమోనియా, పెంటా, హెపటైటిస్ బీ తదితర టీకాలు వేస్తారన్నారు. గర్భిణులకు కూడా టీకాలు వేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కోమలి, కృష్ణమ్మ, లక్ష్మీకాంతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో అడిగిన వారందరికీ పని



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహులు

తనకల్లు: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు 7 వేలకు పైగా జాబ్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. అయితే పనికి వెళ్లే కూలీల సంఖ్య తక్కువగా ఉందన్నారు. వెంటనే కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఉపాధి హామీ పనులలో ఎస్సీ, ఎస్టీ వర్గాల కూలీలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాలలో పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోజువారీ కూలీల సంఖ్య పెంచకపోయినా, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ మరియమ్మ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించండి

గాండ్లపెంట: కూలీలకు పనులు కల్పించాలని ఏపీఓ మంజునాథ్ సాంకేతిక, క్షేత్ర సహాయకులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కూలీలకు పనులపై అవగాహన కల్పించి హాజరయ్యే విధంగా చూడాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల పెంపకం చేపట్టిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు.

ఉచితంగా తాగునీటి పంపిణీ



కృష్ణసుమన్ రెడ్డి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్

ప్రశాంతి నిలయం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కృష్ణసుమన్‌రెడ్డి సేవాభావం చాటుకుంటున్నారు. నిత్యం తాగునీరు ఉచితంగా పంపిణీ చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. నల్లమాడ మండల కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. నల్లమాడతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు నాలుగేళ్లుగా రోజూ సుమారు 16 వేల లీటర్ల తాగునీరు ఉచితంగా సరఫరా చేయిస్తున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా సేవలకు విరామం ప్రకటించలేదని ప్రజలు కొనియాడుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సహకారంతో ప్రజా సేవలో ముందుకెళ్తున్నట్లు కృష్ణసుమన్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: గ్రామంలో ప్రతిఒక్కరూ స్నేహభావంతో ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామంలో బుధవారం రాత్రి గ్రామసభను ఏర్పాటు చేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గొడవలకు దూరంగా ఉండాలన్నారు. పేకాట, మట్కా మంచిది కాదని సూచించారు. ద్విచక్రవాహనంలో వెళ్లే వారు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపరాదని సూచించారు. అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నేళ్లు అద్దె భవనంలో కార్యాలయం ఉండేదన్నారు. తాజాగా ప్రజలకు అనుకూలంగా పట్టణ నడిబొడ్డున ఉన్న మార్కెట్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలోకి కార్యాలయాన్ని మార్చామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తం రెడ్డి, పెనుజూరు నాగరాజు, జిలాన్‌బాషా, కేతా లోకేష్, గజ్జల శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్‌బాషా, తొండమాల రవి, చెలిమి పెద్దన్న, భూశెట్టి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, సబ్‌రిజిస్ట్రార్ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ: చేతుల పరిశుభ్రత, నోటి పరిశుభ్రత, దంతాల పరిశుభ్రతపై బుధవారం సానేవారిపల్లి పాఠశాల విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ లక్ష్మీ నరసమ్మ, సీహెచ్‌ఓ భార్గవి, ప్రధానోపాధ్యాయులు జయకుమార్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, మారుతి, ఎఎన్‌ఎం క్రిష్ణవేణి, ఆశా కార్యకర్తలు శాంతమ్మ, రంగమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పౌష్టికాహారం తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ రాజేంద్ర విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీవీఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కూరగాయలు, పాలు, గుడ్లు, తదితర వాటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పథకాలతో పేదలకు మేలు



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ

ధర్మవరం రూరల్: సీఎం జగన్ పథకాలతో పేదలకు మేలు కలుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని 25వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య చికిత్సలు అందించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కంటి చూపు సరిగా లేని వారికి చికిత్సలు చేసి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు మేడాపురం వెంకటేష్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ధర్మవరం: పట్టణంలోని 16వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డిలు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కేతా లోకేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చెలిమి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు మశానం పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్‌ఎస్‌రోడ్డులో ఉన్న సచివాలయం పరిధిలోని మశానం పేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు హాజరవుతారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు హాజరై పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తనకల్లు: తరుకవాండ్లపల్లి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు హసనాపురం చంటి బుధవారం రూ. 5 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, నాయకులు జానకీరామ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు అదనపు బస్సు

కదిరి అర్బన్: కదిరి నుంచి బెంగళూరుకు అదనపు ఎక్స్‌ప్రెస్ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ పేర్కొన్నారు. మొలకలచెరువు, చింతామణి, హోస్కోట, కేఆర్‌పురం, టిన్ ఫ్యాక్టరీ, ఐటీఐ గేట్, మార్తహల్లి, ఎలక్ట్రానిక్ సిటీ మీదుగా బెంగుళూరు చేరుతుందన్నారు. రిజర్వేషన్ కోడ్ 52577 ఉంటుందన్నారు. తిరిగి 4.30కు బయలుదేరి కదిరికి చేరుతుందన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకుల వితరణ

అమడగూరు: మండలంలోని గాజులపల్లి సమీపంలో ఉన్న శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి ఎస్‌ఐ బలరామయ్య నిత్యావసర సరుకులను వితరణగా ఇచ్చారు. బుధవారం ఆశ్రమానికి వెళ్లిన ఆయన తన వంతు సాయంగా బియ్యంతో పాటుగా అంగడి సరుకులను అందజేశారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

నేడు రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ఎన్పీకుంట: మండల కేంద్రంలో రూ.21.80 లక్షల అంచనా వ్యయంతో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ఎన్.పీ.కుంట–1 'రైతు భరోసా' కేంద్రాన్ని గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ఈటెరాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోస్టర్ల విడుదల

కదిరి అర్బన్: స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో బుధవారం జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నరసారెడ్డి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 10న పాఠశాల స్థాయిలో, 30న మండలస్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 2024లో 27,28వ తేదీలో రాష్ట్రస్థాయి చెకుముకి పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త చంద్రాయుడు,వీరాస్వామి, చిన్నారావ్, సుబ్బారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దీప, జస్వంత్ అనే విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, పీఈటీ ఓబులేసు తెలిపారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్– 17 హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. నవంబర్‌లో విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ విజయ్ కుమార్ నాయక్

ధర్మవరం రూరల్: ధర్మవరం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఆర్. విజయ్‌కుమార్ నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి, శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి

ఓడీచెరువు: ఆర్థిక అక్షరాస్యతతో సంపూర్ణ అభివృద్ధి చెందుతారని ఏడీసీసీ నోడల్ అధికారి శ్రీనివాసులు, బ్యాంకు మేనేజర్ అర్చన పేర్కొన్నారు. బుధవారం అల్లాపల్లి పీఏసీఎస్ సంఘం ఆధ్వర్యంలో రైతులకు, మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఏడీసీసీ బ్యాంకు ఖాతా కలిగి ఉంటే దీర్ఘకాలిక రుణాలు, మహిళా సంఘాలకు బంగారు రుణాలు తక్కువ వడ్డీకే ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటశివారెడ్డి, డైరెక్టర్ రామాంజినేయులు, సీఈఓ రామాంజినేయులు ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కదిరి టౌన్: పట్టణంలోని షామీరియా వీధిలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వివరాలు.. స్థానికంగా ఉండే ఇమ్రాన్, మహారాష్ట్రలోని ఔరంగాబాదుకు చెందిన సయ్యద్ తస్నుమ్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఇమ్రాన్‌పై తస్నుమ్ కేసు పెట్టి జైలుకు పంపింది. జైలు నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి ఇమ్రాన్‌కు, తస్నుమ్‌నుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి ఇర్ఫాన్, వారి కుటుంబ సభ్యులు ఆమెతో గొడవకు దిగారు. 24 వార్డు కౌన్సిలర్ అల్తా ముస్తఫాతో పాటు స్థానికులు బషీర్, నూరుల్లా, హబీబుల్లా, జబీబుల్లా, కబీర్ అడ్డుపడగా వారితోనూ ఘర్షణకు దిగారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్టణంలోని గంగిరెడ్డిపల్లి కాలనీకి చెందిన బాబావలీ (49) గత నెల 24న తన ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స ఫలించక బుధవారం ఆయన మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.